ప్రమాదమని తెలిసీ...

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం

- ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్న వ్యవసాయ కూలీలు
- పోలీసులు హెచ్చరిస్తున్నా ఆటోవాలాల పరిస్థితిలో మార్పు శూన్యం





వ్యవసాయ పనుల నుంచి ఇళ్లకు ఆటోల్లో కిక్కిరిసి వస్తున్న కూలీలు

• సరిగ్గా ఏడాది క్రితం రబీ సీజన్‌లో కావలి రూరల్ మండలం సర్వాయపాలెం పంచాయతీ పెద్దిన్నెపాళేనికి చెందిన మహిళలు 20 మంది ఆటోలో బోగోలు మండలం నాగులవరం గ్రామానికి వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కోవూరుపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. ఇద్దరు మానసిక వైకల్యం పొందారు. మరో పది మంది అంగవైకల్యం చెందారు. మిగిలిన వారు రూ.లక్షల్లో వైద్యానికి ఖర్చు చేసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా..పోలీసులు హెచ్చరిస్తున్నా వ్యవసాయ కూలీలు, ఆటో వాలాల్లో మార్పు రావడం లేదు.

కావలి: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరం. ఈ విషయం తెలిసీ వ్యవసాయ కూలీలు పరిమితికి మంచి ప్రయాణిస్తూ ప్రాణాలను మీదకు తెచ్చుకుంటున్నారు. సాధారణంగా ఆటోల్లో డ్రైవర్‌తో సహా ఐదుగురు మాత్రమే ప్రయాణించాలి. కానీ ఆటోవాలాలు 20 మంది వరకు తీసుకెళ్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. రబీ సీజన్ ప్రారంభమవడంతో కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో వ్యవసాయ పనుల జోరందుకున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడడంతో రైతుల సుదూర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొచ్చుకుంటున్నారు. ఇదే అదనుగా కొంతమంది ఆటోవాలాలు ఇష్టారీతిన కూలీలను తరలిస్తున్నారు. డ్రైవర్‌తో సహ ఐదుగురు ప్రయాణించాల్సిన ఆటోలో దాదాపు 15 నుంచి 20 మంది వరకు కూలీలను తీసుకెళ్తున్నారు. ఆటోలకు ఇరువైపులా కూలీలు వేలాడుతూ ప్రయాణించడం వల్ల డ్రైవర్‌కు సైడ్‌మిర్రర్‌లో చూసుకునే పరిస్థితి లేకుండా పోతోంది. డ్రైవర్‌కు ఇరువైపులా కూలీలు కూర్చోవడం వల్ల స్టీరింగ్‌ను కంట్రోల్ చేయలేని పరిస్థితి నెలకొంటోంది. ఈ కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు

ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు డిమాండ్ ఏర్పడడంతో రైతులు ఒక్కొక్కరికి రూ.300 నుంచి రూ.500 వరకు కూలి ఇస్తున్నారు. ఆటోవాలాలు ఇంటి దగ్గరకే వచ్చి తీసుకెళ్లడం, తిరిగి సాయంత్రం దింపడం మూలంగా సమయం ఆదా అవ్వడం.. ఆటోలు, బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి తప్పుతుండడం, మారుమూల గ్రామాలకు బస్సులు లేకపోవడం, తదితర కారణాలతో కూలీలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆటోల్లో సుదూర ప్రాంతాలకు సైతం కూలి పనులకు వెళ్తున్నారు. ఆటోలో 20 మందిని ఎక్కించుకుంటే ఒక్కొక్కరి నుంచి రాను,పోను రూ.40 చొప్పున మొత్తం రూ.800 బాడుగ గిట్టుబాటు అవుతుంది. రూ.200 డీజిల్ ఖర్చులకు పోయినా రూ.600 వరకు మిగులుతుంది. రోజంతా సాధారణ కిరాయిలకు వెళితే రిస్కు, ఆ మాత్రం బాడుగ గిట్టుబాటు లేకపోవడంతో వ్యవసాయ కూలీల రవాణాకే ఆటో వాలాలు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయ కూలీలను తీసుకెళ్లే ఆటో వాలాలు ఓపిక ఉంటే ఇతర కిరాయిలకు వెళ్లి సాయంత్రం వచ్చి కూలీలను తీసుకెళుతారు, ఓపిక లేని వారు, రిస్కు ఎందుకులే అనుకునే వారు వ్యవసాయ కూలీలతో పాటు తాను కూలి పనిచేసి రూ.300 వరకు సంపాదిస్తుంటారు. లాభసాటిగా ఉన్న ఈ తరహా గిరాకీలను వదులుకునేందుకు ఆటోవాలాలు ఇష్టపడడం లేదు.20 మందిని ఎక్కించుకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, 15 మందిలోపే ఎక్కించుకోవాలని రైతులు వారించినా తమకు గిట్టుబాటు కాదంటూ ఆటో వాలాలు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రాణాలు పోయే అంశాన్ని పక్కన పెట్టి తాత్కాలిక సౌకర్యం కోసం కూలీలు, ఆటో వాలాలు, రైతులు ఆటోలపై ఆధారపడడంతో నిరుపేద కూలీల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయి.

పోలీసులు హెచ్చరిస్తున్నా..

కూలీలను పరిమితికి మించి తీసుకెళ్తున్న ఆటోవాలాలకు పోలీసులు తరచూ కౌన్సిలింగ్ ఇస్తున్నారు. జరిమానాలు విధించడంతో పాటు కేసులు సైతం నమోదు చేస్తున్నారు. అయినా ఆటోవాలాల పరిస్థితిలో మార్పు రావడం లేదు. కూలీలను ప్రమాదకరంగా తీసుకెళ్తున్నారు. ఎక్కడైనా పోలీసులు తనిఖీ చేస్తుంటే కూలీలను దించేస్తున్నారు. కొద్దిదూరం నడిచి రావాలని చెప్పి పోలీసులను దాటిన తరువాత తిరిగి ఎక్కించుకుని వెళ్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కావలి: ముసునూరులోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ పక్కాగృహంలో ముప్పవరపు శాంతకుమార్(35) అనే వ్యక్తి శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముసునూరులోని అట్టల ఫ్యాక్టరీ కాలనీకి చెందిన ముప్పవరపు శాంతకుమార్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అతను భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్నాడు. కొద్దిరోజులుగా కందుకూరు ప్రాంతానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో వారి మధ్యన విబేధాలు రావడంతో చర్చించుకోవడానికి ఇద్దరూ కలిసి జగనన్న కాలనీ వద్దకు వెళ్లారు. అక్కడ సదరు మహిళపై శాంతకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో తనను కొడుతాడనే భయంతో సదరు మహిళ అక్కడి నుంచి వచ్చేసింది. ఈ క్రమంలో బ్యాగు మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత బ్యాగు తెచ్చుకునేందుకు మళ్లీ ఆ ప్రాంతానికి వెళ్లగా శాంతకుమార్ చనిపోయి ఉన్నాడు. దీంతో కావలి రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చి సమాచారం తెలియజేసింది. దీంతో కావలి డీఎస్పీ శ్రీధర్, కావలి సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్సై ఎం బాజిబాబు మహిళను వెంటబెట్టుకుని ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. రాత్రి కావడం.. ఆ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో హత్యా, ఆత్మహత్యా ..అనే విషయంలో నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయారు. రాత్రి 9.30 గంటలకు మృతదేహాన్ని కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి హత్యా, ఆత్మహత్య అనేది నిర్ధారించాల్సి ఉంటుందని పోలీసులు తెలిపారు. కాగా మృతుడి సోదరుడిని గుర్తించిన పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

ఆత్మకూరురూరల్: సచివాలయ సిబ్బంది సకాలంలో విధులకు హాజరై బయోమెట్రిక్ వేస్తేనే జీతాలు అందుతాయని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని వెన్నవాడ, బోయలచిరివెళ్ల సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. జియో ట్యాగింగ్ నమోదు 60 శాతం మాత్రమే పూర్తయిందని, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

26న సీపీఎం ధర్నా

ఆత్మకూరురూరల్: ప్రజా సమస్యలపై ఈ నెల 26న ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ శివప్రసాద్, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య తెలిపారు. పట్టణంలోని డాక్టర్ చెర్లో రమణారెడ్డి భవన్‌లో సీపీఎం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. విద్యుత్, మున్సిపాలిటీ, అంగన్‌వాడీ, ఆశ, ఆర్టీసీ, తదితర రంగాలకు చెందిన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని తీర్మానించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



కావలి: మాట్లాడుతున్న సీఐ రాజేశ్వరరావు



ఆత్మకూరు: అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ కే వేణుగోపాల్



మర్రిపాడు: నందవరం ఆదర్శ పాఠశాలలో..



సంగంలో..



కొండాపురం ఆదర్శ పాఠశాలలో..



వరికుంటపాడు: తిమ్మారెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో..



సీతారామపురంలో..



కలిగిరిలోని ఆదర్శ పాఠశాలలో..



వింజమూరులో..

కావలి: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనమవుతాయని, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలని కావలి రూరల్ సీఐ జీ రాజేశ్వరరావు సూచించారు. పట్టణంలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాలు–దుష్ప్రభావాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై యువత చైతన్యవంతమై సామాజిక బాధ్యతగా భావించి వాటిని అరికట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్‌నాయుడు,ప్రిన్సిపల్ డాక్టర్ టీవీ రావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జీ రమేష్ బాబు పాల్గొన్నారు.

ఆత్మకూరు/సోమశిల/మర్రిపాడు/సంగం: యువత మాదక ద్రవ్యాలు, జూదాలు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో సాంఘిక రుగ్మతల నియంత్రణపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, ఎస్సైలు ఎస్‌కే జిలానీ, సాయిబాబా, సంఘ సేవకుడు కేసీ కృష్ణయ్య పాల్గొన్నారు. అనంతసాగరంలోని ఎస్సార్ అండ్ బీ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల్లోని విద్యార్థులకు ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి , మర్రిపాడు మండలం నందవరం ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు ఆత్మకూరు సీఐ గంగాధర్ మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సంగంలోని నేతాజీ జూనియర్ కళాశాల విద్యా ర్థులకు సీఐ వేమారెడ్డి అవగాహన కల్పించారు. ఎస్సై రాజేష్, కరస్పాండెంట్ మదార్‌బాషా పాల్గొన్నారు.

ఉదయగిరి/దుత్తలూరు/వరికుంటపాడు/కలిగిరి/సీతారామపురం/కొండాపురం: ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి జూనియర్ కళాశాలలో ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి , వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలో ఎస్సై వీరప్రతాప్ , దుత్తలూరు మండలం నర్రవాడ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్సై పీ ఆదిలక్ష్మి , కలిగిరిలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎస్సై ఉమాశంకర్, వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్సై రఘునాథ్, సీతారామపురంలోని ఎల్‌వీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఏఎస్సై వెంకటసుబ్బయ్య , కొండాపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఎస్సై వెంకట్రావ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.



సోమశిల: అనంతసాగరంలో..



దుత్తలూరు: నర్రవాడ ఉన్నత పాఠశాలలో..



ఉదయగిరిలో..

ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాటం



చేజర్లలో స్వర్ణకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటం సాగిస్తోందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ పేర్కొన్నారు. ఆత్మకూరులోని ఎల్‌ఆర్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్ మోహన్‌రావు అధ్యక్షతన స్వర్ణోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి నిర్వహించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా హెచ్ మురళీకృష్ణ, అధ్యక్షుడిగా ఎస్ మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే ఇమామ్‌బాషా, ఎస్వీ ప్రసూన, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే ఖాదర్‌బాషా, కోశాధికారిగా ఎస్‌కే మస్తాన్‌షరీఫ్ ఎన్నికయ్యారు.

చేజర్ల: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శ చలపతిశర్మ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ మహాసభను నిర్వహించారు.ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఆర్ కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శిగా నాగినేని రమణయ్య, గౌరవాధ్యక్షుడిగా ఏ సుబ్రహ్మణ్యం, సహాధ్యక్షులుగా ఏ వెంకటేశ్వర్లు, షేక్ షకీల, కోశాధికారి ఎస్ బుజ్జయ్య, కార్యదర్శులుగా పీ నరహరి, ఎస్కే మస్తాన్‌బాషా, ఎస్ శంకర్, శ్రీరాములు, మాధవ, పోలయ్య ఎన్నికయ్యారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

మడపల్లికి చెందిన పేద విద్యార్థిని చీకటి స్వర్ణకు యూటీఎఫ్ మండల నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. స్వర్ణ తండ్రి నాలుగేళ్ల క్రితం చనిపోయారు. తల్లి కూలి పనులు చేస్తూ నెల్లూరులోని రత్నం కళాశాలలో ఫార్మసీ చదివిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యార్థినికి చదువు కోసం రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎంఈఓ–2 మస్తానయ్య, చేజర్ల జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం హైమావతి పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

అల్లూరు :ప్రకృతి విపత్తులు, మానవ తప్పిదాల వల్ల కలిగే ప్రమాదాలపై ముందస్తు అవగాహన కలిగి తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ దరియప్ప పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపల్లిలో ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు, తుఫాన్‌లు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విపత్తుల సమయంలో బాధితులను కాపాడడం, ప్రథమ చికిత్సను అందించడం, తదితర అంశాలపై మాక్‌డ్రిల్ చేసి చూపించారు. మెరైన్ సీఐ డీ ప్రసాద్, ఎస్సై నాయబ్‌రసూల్, డీటీ ప్రవీణ్ కుమార్, ఆర్‌ఐ ప్రభుదీప్, ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు



ఆలయాన్ని పరిశీలిస్తున ఇంజనీర్లు

దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఈఓ ఉషశ్రీ తెలిపారు. వెంగమాంబ దేవస్థానాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ మురళి, శిల్పి సురేంద్ర శుక్రవారం సందర్శించారు. దేవస్థానంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్లాన్లు, అంచనాల తయారీకి కొలతలు సేకరించారు. ప్రాధాన్యతా క్రమాన్ని అనుసరించి అంచనాలు రూపొందించి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సిఫార్సుతో టీజీఎఫ్ నిధులు, దాతల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని ఈఓ తెలిపారు. కాగా ఈ నెల 25న కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని దొడ్డకొండపై ఉన్న వెంగమాంబ విగ్రహం వద్ద పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహానైవేద్యం, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ వివరించారు.

జూనియర్ న్యాయవాదుల పరిచయం



కావలి: పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో జూనియర్ న్యాయవాదుల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కావలి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కాటా సురేంద ర్‌రెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి శోభా, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి సుధాకర్, స్పెషల్ మేజిస్ట్రేట్ పరశురామ్, తదితరులు హాజరయ్యారు. సీనియర్ న్యాయవాదులు దేవరపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఎక్స్ కెన్నెడీ, పీవీ శివప్రసాద్‌రెడ్డి, ఏ జగన్మోహన్‌రావు, ఐ సాయి ప్రసాద్ తదితరులు జూనియర్ న్యాయవాదులకు కేసుల పరిష్కారంలో తమ అనుభవాలను వివరించారు. న్యాయవాదుల సంఘ ప్రధాన కార్యదర్శి మిట్టసల జయప్రకాష్ డ్రెస్ కోడ్, కోర్టు హాల్‌లో ఏ విధంగా నడుచుకోవాలో సూచించారు. న్యాయవాదుల సంఘ ఉపాధ్యక్షుడు సీహెచ్ సునీల్ బాబు, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ అభిషేక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, మహిళా ప్రతినిధి జ్యోతి, ఏజీపీ టీ మల్లికార్జున్, పీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఆడిట్

ఉదయగిరి: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్, జిల్లా ఆడిటర్ సీహెచ్ హరివర్మ, ఆడిట్ సబ్‌రిజిస్ట్రార్ శ్రీరామ్మూర్తి శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, రికార్డులను తనిఖీ చేశారు. సాధారణ ఆడిట్‌లో భాగంగా రికార్డులను తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. ఆడిట్ సీనియర్‌సహాయకుడు రమేష్‌బాబు, సబ్‌రిజిస్ట్రార్ కృష్ణచైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విక్రయించాలి



కావలి: ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కందుకూరు ఏడీఏ పీ అనురాధ హెచ్చరించారు. పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల దుకాణాలను కావలి ఏఓ ఏ లలితతో కలిసి ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీ చేశారు.రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

ఆత్మకూరురూరల్: కనుపూరుపల్లిలోని ఎంపీపీఎస్ పాఠశాలలో గీతా జ్ఞానయజ్ఞ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలను శుక్రవారం నిర్వహించారు. విజేతలకు సమితి నిర్వాహకులు గార్లపాటి సురేష్‌బాబు, రామయ్యస్వామి బహుమతులు అందజేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

అనుమసముద్రంపేట: స్థానిక సాయిబాబా మందిరం సమీపంలో జమ్మవరానికి చెందిన ఓ వ్యక్తి మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకెళ్తుండగా శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు. 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జలదంకి: కమ్మవారిపాళెంలో గన్నవరపు వెంకటరమణయ్య అనధికారికంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి: స్థానిక 133 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఖుద్దూస్‌బాషా శుక్రవారం తెలిపారు. దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

సీఎం సహాయనిధికి రూ.20 లక్షల విరాళం

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలోని వివిధ వర్గాలకు చెందిన దాతలు రూ.20లక్షలను సీఎం సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు శుక్రవారం అందజేశారు. ఆయన విజయవాడ వరద బాధితుల కోసం అమరావతిలో సీఎం చంద్రబాబునాయుడుకు నగదును అందజేశారు.

కోటితీర్థంలో గ్రామసభ

చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు, కోటితీర్థం గ్రామాల విభజనపై కోటితీర్థం పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్ మస్తానయ్య మాట్లాడుతూ రెండు గ్రామాల పొలాలకు సంబంధించి సహజ సిద్ధమైన హద్దుల విషయమై రైతులతో చర్చించారు. రైతుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇరు గ్రామాల రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 25వ తేదీలోగా లిఖిత పూర్వకంగా తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేయాలని కోరారు. ఎంపీడీఓ విజయలిత, వీఆర్వో కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ అన్నలూరు శ్రీనివాసులునాయుడు, ఆత్మకూరు ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు గోతం వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఆత్మారామునికి భూమి విరాళం

సంగం: మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న ఆత్మారామస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన దొడ్ల పద్మనాభరెడ్డి 3.97 ఎకరాల భూమిని విరాళంగా అందజేశారు. శుక్రవారం భూమికి సంబంధించిన పత్రాలను జిల్లా దేవాదాయశాఖ అధికారి ద్వారా ఆలయ ఈఓ ప్రసాద్‌రెడ్డికి అందజేశారు. భూమిలో బోరు ఏర్పాటు చేయించి భూమి హద్దులు చూపించి స్వాధీనం చేశారు. దీంతో దాతను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

దుప్పట్ల వితరణ



కావలి: పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ విమలరూబి జన్మదిన వేడుకలను స్కూల్ ఉపాధ్యాయులు ప్రవీణ్, మెరీనా, వనజ, అన్నపూర్ణమ్మ, జేవీ లలిత, శ్రీహరి, రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో విమలరూబితో కేక్ కట్ చేయించారు. అనంతరం సేవా సంస్థ సహకారంతో చదువుకుంటున్న పేద పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నేత్రదానం



రమణయ్య (ఫైల్)

కావలి: మండలంలోని పూలదొరువుకు చెందిన ప్రముఖ గాంధేయవాది, మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి అనుచరుడు నూవుశెట్టి వెంకటరమణయ్య (91) శుక్రవారం మరణించారు. ఆయన కోరిక మేరకు నేత్రాలను కుమారులు ఉమాసాయిప్రసాద్, కృష్ణకిషోర్, గిరిచంద్ దానం చేశారు. కావలి రెడ్‌క్రాస్ సహకారంతో నెల్లూరు మోడరన్ ఐ ఆస్పత్రికి చెందిన వేణుగోపాల్ కార్నియాలను సేకరించారు. రమణయ్య భౌతికకాయాన్ని కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులు డీ రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ రమణయ్యది రెడ్‌క్రాస్ ద్వారా జరిగిన 133వ నేత్రదానమని తెలిపారు.

బహుమతుల ప్రదానం



చేజర్ల/అనంతసాగరం: ఆదూరుపల్లిలోని గురుకుల పాఠశాల, అనంతసాగరం గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ శైలజకుమారి, లైబ్రేరియన్లు నారాయణరావు, శ్యామలకుమారి, వైస్‌ప్రిన్సిపల్ నాగలలిత పాల్గొన్నారు.

అంకమ్మకు విశేష పూజలు

సోమశిల: అనంతసాగరంలోని అంకమ్మ ఆలయంలో 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సడ్డా వెంకటరమణారెడ్డి, సడ్డా శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సుమారు వేయి మందికి పైగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



ఆత్మకూరు: పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వినాయక, అయ్యప్ప, కుమారస్వాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనంలో కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆత్మకూరు సీఐ గంగాధర్, బీజేపీ నాయకుడు కుడుముల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కావలి/సోమశిల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి పేర్కొన్నారు. ముసునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో కావలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు 18 ఏళ్లు, బాలురు 21 ఏళ్లు నిండిన తరువాతే వివాహాలు చేసుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు సంబంధించిన 1098, 181, 112 హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ కే సౌజన్య మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సీహెచ్ లావణ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, అంగన్‌వాడీలు రమాదేవి, ప్రభావతి, శివలీల, సుకన్య, సుశీల పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం ఎస్సీకాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై ఐసీడీయస్ సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎం తనిఖీలు

ఉదయగిరి: ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలందించడమే ఆర్టీసీ సంస్థ ప్రధాన లక్ష్యమని నెల్లూరు రీజియన్ మేనేజర్ ఎం మురళీబాబు పేర్కొన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రీజియన్ పరిధిలోని అన్ని డిపోలను లాభాల బాటలో నడిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. కొత్తగా సమయపాలన మాసోత్సవాలను ఈ నెల 16 నుంచి డిసెంబర్ 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఆర్టీసీ, హయర్ బస్సుల డ్రైవర్లకు జోనల్ కార్యాలయంలో శుక్రవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.